మైక్రో ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్.. పరిశీలన

ఆవిర్భవించిన ఒక దశాబ్దంలోనే సూక్ష్మ విత్త వ్యవస్థలు (మైక్రో ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్) ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రజానీకాన్ని అతలాకుతలం చేశాయి. 2010లో దాదాపు 60 మంది బలవన్మరణాలకు కారణమయ్యాయి. 2006లో 200కు పైగా రుణగ్రస్తులు బలవన్మరణం చెందారు. అలాగే ఈ వ్యవస్థలు.. స్వయం శక్తి సముదాయాలను రుణ ఊబిలోకి దించి, వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు దోహదం చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూక్ష్మ విత్త వ్యవస్థల పుట్టు పూర్వోత్తరాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మీద వాటి ప్రభావంపై విశ్లేషణ.

గత ఏడాది వీటి కార్యకలాపాల మీద మీడియా, రాజకీయ పార్టీలు, మేధావి వర్గాలు విస్తృతంగా చర్చించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దుమారాన్ని అడ్డుకోవడానికి స్వీయ రక్షణలో పడింది. వీటిని నియంత్రించడానికి ఆర్డినెన్స్ జారీ చేశారు. ఆ తర్వాత ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ వై.హెచ్. మాలిగాం అధ్యక్షతన రిజర్వు బ్యాంక్ ఒక ఉప కమిటీని ఏర్పాటు చేసింది.

సూక్ష్మ విత్త వ్యవస్థ అంటే?

సూక్ష్మ విత్త వ్యవస్థ ఒక ఉద్యమం. 'అల్పాదాయం కలిగిన కుటుంబాలకు ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచడం ద్వారా ఆదాయాన్ని పెంపొందించే కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఆస్తులు సమకూర్చడం, వినిమయాన్ని స్థిరీకరించడం, ఉప ద్రవాల నుంచి రక్షించడం'. కేవలం రుణ సదుపాయాన్ని కల్పించడమే కాకుండా పొదుపును ప్రోత్సహించడం; బీమా సదుపాయాన్ని కలిగించడం; నగదు బదిలీ చేయడం; రుణాన్ని అందించడంతోపాటు దానిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా పేదలు స్వశక్తి మీద ఆధారపడే పరిస్థితిని కల్పించడం దీని లక్ష్యం. ఉదాహరణకు ఒక గ్రామీణ మహిళకు కుట్టుమిషన్ కొనుక్కోవడానికి రుణాన్నివ్వడంతోపాటు ఆ పనిలో శిక్షణనిచ్చి, ఆ మహిళ కుట్టిన దుస్తులకు మార్కెట్‌లో గిరాకీ కల్పించడం ద్వారా ఆమె పేదరిక ఊబి నుంచి బయటపడడానికి చేయూతనివ్వడమే సూక్ష్మ విత్త వ్యవస్థ లక్ష్యం.

మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించాలనే ఉద్దేశంతోనే స్వయం శక్తి సముదాయాల (Self Help Gro-ups SGHs) ఏర్పాటును ప్రోత్సహించి వాటికి సూక్ష్మ రుణ సదుపాయాన్ని కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ సంస్థ ద్వారా, 1990ల నుంచి సమష్టి రుణాలివ్వడం ప్రారంభించింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సముదాయాలకు, బ్యాంకులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు భాగస్వామ్యం కల్పించారు. కేరళ ప్రభుత్వం ప్రారంభించిన 'కుడుంబశ్రీ' పథకం ఇందుకు ఉదాహరణ. అయితే ఈ ప్రయోగం దేశవ్యాప్తంగా ఆశించిన మేర విజయవంతం కాలేదు. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో పావలా వడ్డీ పథకం ద్వారా



స్వయం శక్తి సముదాయాలకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించారు. అయితే ఈ పథకం ద్వారా కొంతమందికి మాత్రమే వెసులుబాటు కలిగింది. బడ్జెట్ కేటాయింపులు సరిపడినంత లేకపోవడం, ప్రభుత్వోద్యోగుల నిరాసక్తత ఈ పథకం విజయవంతం కాకపోవడానికి ప్రధాన కారణాలు. ఈ నేపథ్యంలో పేద ప్రజలు తమ అవసరాల కోసం సూక్ష్మ రుణ వ్యవస్థవైపు దృష్టి సారించారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. వడ్డీ వ్యాపార సంస్థలతో పోల్చితే సూక్ష్మ రుణ సంస్థలు మెరుగైనవిగా కనపించాయి. ప్రారంభ దశలో ఈ సంస్థల యాజమాన్యం 'సామాజిక సేవే మా లక్ష్యం' అని ప్రకటించాయి. ఆకర్షణీయమైన పేర్లతో, స్వచ్ఛంద సేవా సంస్థల ముసుగులో వాణిజ్య కార్యకలాపాల ద్వారా లబ్ధి పొందడానికి రంగంలో ప్రవేశించాయనే విమర్శలకు ఇవి లోనయ్యాయి. ఇవి వాస్తవానికి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (NBFEs) స్పందన స్ఫూర్తి, షేర్, ఎస్‌కేఎస్, బేసిక్స్ తదితర సంస్థలు పేరు పొందిన సూక్ష్మ విత్త సంస్థలు. ఈ సంస్థల యాజమాన్యం స్వయం శక్తి సముదాయాల సభ్యులైన మహిళలను (45,000 మంది) వాటాదార్లుగా చేర్పించి వారు చెల్లించాల్సిన మూలధనాన్ని తామే సమకూర్చింది. దాంతో ఒకనాటి స్వచ్ఛంద సేవాసంస్థలు, నేడు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్‌గా అవతరించాయి. ఆ తర్వాత వీటిని ట్రస్ట్‌లుగా మార్చి బహిరంగ మార్కెట్‌లో విక్రయించాయి. వాటాల విలువ పెరిగినప్పుడు రూ. వేల కోట్లు లాభాలు ఆర్జించాయి. మహిళల పేరుతో కొన్న వాటాలకు పెట్టుబడిదాతృత్వ సంస్థల విరాళం. ఈ కంపెనీల షేర్లు కొన్నవారు సహజంగా ఎక్కువ లాభాలు గడించాలని యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో యాజమాన్యం రుణగ్రస్తుల ఆర్థిక స్థోమతను పరిగణనలోకి తీసుకోకుండా ఉదారంగా రుణాలిచ్చాయి. ఒకే వ్యక్తికి రెండు, మూడు కంపెనీలు రుణాలిచ్చాయి. దీంతో రుణగ్రస్తులు రుణాలు తీర్చలేని స్థితి ఏర్పడింది. వడ్డీ రేట్లలో స్పష్టత లేదు. వడ్డీ రేటు చివరి వాయిదా వరకు ఒకే రకంగా ఉంటుంది. పేరుకు 10-12 శాతం వడ్డీ. వాస్తవానికి అది 60 శాతం వరకు చేరుకుంటుంది. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజలకు ఈ లెక్కలు అర్థం కావు. గడవులోపల అసలు, వడ్డీ చెల్లించకపోతే సూక్ష్మ రుణ వ్యవస్థల ఉద్యోగులు వీరిని బెదిరించారు, అవమానపరిచారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది ఆత్మహత్యలకు

పాల్పడ్డారు.

ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలు

- **బ్యాంకులు:** 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వెలుగు' కార్యక్రమం కింద స్వయం సముదాయాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించింది. కానీ బ్యాంకుల నిబంధనలు, వాటి వల్ల లభ్యమయ్యే రుణ పరిమితి ఎంతోమంది లబ్దిదారులను నిరాశపరిచింది. పైగా బ్యాంకులకు చిన్న మొత్తంలో రుణాలు ఎక్కువ సంఖ్యలో ఇవ్వాలంటే చాలా ఖర్చవుతుంది. అందుకని బ్యాంకులు ఏదో ఒక కారణం చూపి రుణాలిచ్చేవికావు. ఈ పరిస్థితుల్లో సహజంగానే పేద ప్రజలు ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. అవే సూక్ష్మ రుణ సంస్థలు.
- ప్రారంభంలో ఈ సూక్ష్మ రుణ సంస్థలు సామాజిక సేవే మా లక్ష్యం అన్నట్లు వ్యవహరించాయి. క్రమేణా వాటి నిజ స్వరూపం బహిర్గతమైంది. లాభాపేక్షే వీటి ప్రధాన ఉద్దేశంగా మారింది. ఒక్కొక్కరికి రెండు, మూడు సంస్థలు రుణాలివ్వడం అవి తీర్చలేక అదనంగా అప్పులు చేయడం సంభవించింది.
- **ప్రజల్లో పెరిగిన రుణ సంస్కృతి:** సాధారణంగా గ్రామీణ మహిళలు అప్పు తీసుకోవడానికి వెనుకాడుతారు. కానీ తామరతంపరగా పుట్టుకొచ్చిన ఈ రుణ సంస్థలు పోటీపడి అప్పులు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయి. సులభంగా రుణాలు లభించడం ప్రజల వైఖరిలో మార్పు తెచ్చింది.
- **ప్రకృతి వైపరీత్యాలు, ప్రపంచ ఆర్థిక మాంద్యం, ప్రాంతీయ ఉద్యమాలు** ప్రజల జీవనోపాధిని దెబ్బతీశాయి. ఆదాయం తగ్గడం, ధరలు పెరగడం వంటి పర్యవసానాలు కూడా ప్రజలను సూక్ష్మ రుణ సంస్థలవైపు తిప్పాయి.
- **రాజకీయాలు.** ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని దెబ్బతీయడానికి.. ఓటర్లను రుణాలు చెల్లించొద్దని చెప్పడం.. తాము వస్తే ఆ రుణాలు రద్దు చేస్తామనడం పరిపాటైంది. ప్రజలు వీరి వాగ్దానాలు నమ్మి స్థోమత ఉన్నప్పటికీ రుణాలను తీర్చకపోవడంతో అప్పు ఇచ్చిన సంస్థలు (బ్యాంకులతో సహా) వారి మీద ఒత్తిడి తేవడం జరుగుతోంది.

సూక్ష్మ విత్త వ్యవస్థలకు ఇటీవల కాలంలో విస్తృత ప్రచారం కల్పించి ఇవి పేద ప్రజలకు ఎంతో సహాయపడుతున్నాయనే భ్రమ కలిగించారు. ఇందులో మీడియా పాత్ర కూడా కొంత మేర ఉంది. వీటి మద్దతు దారులు ప్రచారం చేసినట్లు..

- ఇవి పేద ప్రజలకు రుణ సౌకర్యాల కల్పనలో మార్గదర్శకులు కాదు. 1992లో కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా స్వయం శక్తి సముదాయాలకు రుణ సౌకర్యం అందజేసింది. దాదాపు తొమ్మిది కోట్ల కుటుంబాలకు 23 కోట్ల రూపాయల రుణం అందించింది. సూక్ష్మ విత్త వ్యవస్థలు కేవలం మూడు కోట్ల కుటుంబాలకు మాత్రమే రుణాలు అందించాయి. స్వయం శక్తి సముదాయాల ద్వారా రుణ సహాయంతోపాటు పొదుపును ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలు పెంపొందించడం లాంటి నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం జరిగింది. కానీ ప్రస్తుత సూక్ష్మ విత్త వ్యవస్థలు ఎక్కువ భాగం రుణాలివ్వడానికి శ్రద్ధ చూపిస్తున్నాయి.
- బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేని పేద ప్రజలకు ఇవి అందుబాటులో ఉన్నాయనే వాదనలో నిజం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సగటు రుణ, నిక్షేపం (credit, deposit) నిష్పత్తి 105 శాతం. జాతీయ సగటు కేవలం 63 శాతమే. ఇవి నిజంగా పేదలకు సహాయపడాలంటే ఈ నిష్పత్తి తక్కువగా ఉన్న మిగతా రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించాలి.
- గ్రామీణ ప్రాంతంలో దారిద్ర్య నిర్మూలనకు ఇవి సరైన సాధనాలనే వాదనలో నిజం లేదు. రుణాల ద్వారా దారిద్ర్యం పోదు. ఇచ్చిన రుణాన్ని ఉత్పత్తి కార్యకలాపాలకు వినియోగించి ఆదాయాన్ని పెంచినప్పుడే దారిద్ర్య నిర్మూలన సాధ్యం. సూక్ష్మ విత్త వ్యవస్థలు ఎక్కువ శాతం వినియోగ అవసరాలకే రుణాలిచ్చాయి. దీనివల్ల ప్రజలు మరింత రుణగ్రస్తులయ్యారు.
- వడ్డీ వ్యాపారస్తుల నుంచి పేద ప్రజలను రక్షించాయనే వాదనలో సరికాదు. వాస్తవానికి ఈ వ్యవస్థలు తమ లాభాల కోసం ప్రజలకు ఇబ్బడిముబ్బడిగా రుణాలిచ్చి 24- 60 శాతం వడ్డీ వసూలు చేశాయి. బ్యాంకుల నుంచి తక్కువ రేటులో రుణాలు పొంది అదే డబ్బును పేద ప్రజలకు రెట్టింపు రేట్లకు రుణాలిచ్చాయి.
- కార్యకలాపాల నిర్వహణకయ్యే ఖర్చు పెరగడంతో ఎక్కువ వడ్డీ వసూలు చేయాల్సి వచ్చిందనే వాదనలో నిజంలేదు. వాస్తవానికి ఈ సంస్థలు ఉన్నతస్థాయి ఉద్యోగులకు రూ. లక్షలు, కోట్ల వేతనాలివ్వడంవల్ల ఖర్చు పెరిగింది. బ్యాంకులకు తమ ఆస్తులమీద ఒక శాతం ప్రతిఫలం లభించడం అంతంతమాత్రమైతే, కొన్ని సూక్ష్మ రుణ సంస్థలు మాత్రం అయిదు శాతం వరకు గడించాయి.

ఈ వ్యవస్థ కార్యకలాపాలను నియంత్రించడానికి మాలిగాం కమిటీ కొన్ని సూచనలు చేసింది. అందులో ముఖ్యమైనవి...

- ఒక వ్యక్తికి రుణ సదుపాయాన్ని ₹ 25 వేలకు పరిమితం చేయాలి.
- రుణంలో 75 శాతాన్ని ఆదాయం పెంపొందించే కార్యకలాపాలకే వినియోగించాలి.
- ఒక వ్యక్తికి రెండుకంటే ఎక్కువ సంస్థలు రుణాలివ్వకూడదు.
- వ్యక్తిగత రుణాల మీద 24 శాతానికి మించి వడ్డీ వసూలు చేయకూడదు.
- ఒక వ్యక్తి ఒకటికంటే ఎక్కువ స్వయం సహాయక సముదాయాల్లో సభ్యత్వం కలిగుండకూడదు.
- రుణాల వసూలుకు బల ప్రయోగం వంటి చర్యలు చేపట్టకూడదు.
- తీసుకున్న రుణం ఆధారంగా చెల్లించాల్సిన గడువు నిర్ణయించాలి.
- వినియోగదారుని రక్షణకు రిజర్వుబ్యాంకు నియమావళి రూపొందించాలి.

ఈ కమిటీ అధ్యక్షుడు అభిప్రాయపడినట్లు ఎక్కువ శాతం సూక్ష్మ విత్త

వ్యవస్థలు పేద ప్రజల ప్రయోజనాలకు భంగకరంగా పనిచేస్తు న్నాయి. లాభాపేక్షే వాటి పరమార్థం.

ముఖ్యాంశాలు

- 1992లో కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా స్వయం శక్తి సముదా యాలకు రుణ సౌకర్యం అందజేసింది. దాదాపు తొమ్మిది కోట్ల కుటుంబాలకు 23 కోట్ల రూపాయల రుణం అందించింది.
- సూక్ష్మ రుణ సంస్థల వడ్డీ రేట్లలో స్పష్టత లేదు. పేరుకు 10–12 శాతం వడ్డీ. వాస్తవానికి అది 60 శాతం వరకు చేరుకుంటుంది.
- ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో పావలా వడ్డీ పథకం ద్వారా స్వయం శక్తి సముదాయాలకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పిం చారు.
- సూక్ష్మ విత్త వ్యవస్థల కార్యకలాపాలను నియంత్రిం చడానికి ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ వై.హెచ్. మాలిగాం అధ్యక్షతన రిజర్వు బ్యాంక్ ఒక ఉప కమిటీని ఏర్పాటు చేసింది.
- ఆంధ్రప్రదేశ్‌లో సగటు రుణ, నిక్షేపం (credit, deposit) నిష్పత్తి 105 శాతం. జాతీయ సగటు కేవలం 63 శాతమే.
- సూక్ష్మ రుణాల కారణంగా గత ఏడాది ఆంధ్ర ప్రదేశ్‌లో 60 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.